క్లుప్తంగా

శివాలయంలో మాసకల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఇష్ట కామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభు లింగేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం మాస కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఆలయంలో స్వామివార్ల విగ్రహాలకు పూలు, పట్టు వస్త్రాలతో అందంగా అలంకరించారు. అనంతరం పుణ్యావచనం, పంచామృతాభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలతో కల్యాణ ఘట్టాన్ని పూర్తిగావించారు. ఈఓ కొండారెడ్డి, అర్చకులు కొంకపాక విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయశర్మ, శంభిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

నాట్య కళామండలి నూతన కమిటీ ఎన్నిక



నాట్య కళామండలి అధ్యక్షురాలు వీరమణికి నియామకపత్రం అందజేస్తున్న కళాకారులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలో బుధవారం మండల నాట్య కళామండలి సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కళాకారులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మండల కేంద్రానికి చెందిన సాదా వీరమణి, ఉపాధ్యక్షుడిగా వేలాద్రి, కార్యదర్శిగా జనిగ వెంకటేశ్వర్లు, కోశాధికారిగా కొండయ్య, వెంకటేశ్వర్లు, సభ్యులుగా కనకయ్య, అంజనేయులు, గుర్వారెడ్డి, దుర్గయ్య, నారాయణరెడ్డి, వెంకటరెడ్డి, కోటేశ్వరరావు, వెంకయ్యలను ఎన్నుకున్నారు.

క్యాట్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

హుజూర్‌నగర్ : క్యాట్ ఒలింపియాడ్‌లో పట్టణంలోని శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాట్ ఆర్గనైజేషన్ సెప్టెంబర్‌లో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ మొదటి లెవెల్‌లో 50 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి సెకండ్ లెవల్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన అభినందించారు.

తలసేమియా బాధితుడికి రూ.3 లక్షల సాయం

మేళ్లచెరువు : మండల కేంద్రానికి చెందిన పుల్లారావు, మాధవి దంపతుల కుమారుడు గత కొంతకాలంగా తలసేమియా వ్యాధితో బాధపడున్నాడు. బుధవారం మండల కేంద్రానికి చెందిన కృషి ఫౌండేషన్ చైర్మన్, పోశం జానకీ ఐరా రియాలిటీ ఎండీ పోశం నర్సిరెడ్డి దంపతులు చిన్నారి వైద్య ఖర్చులకు మూడు లక్షల రూపాయలు అందించినట్లు వారు తెలిపారు.

రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు 'తేజ' విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన తేజ స్కూల్ విద్యార్థులు

కోదాడరూరల్ : పట్టణంలోని సీసీరెడ్డి పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా బాలబాలికల అండర్- 14, అండర్- 17 బాస్కెట్ బాల్ పోటీల్లో కొమరబండలోని తేజ విద్యాలయ విద్యార్థులు 12 మంది ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ -14కి హర్షవర్ధన్, భువనేష్, హర్ష, సమద్, భాగ్య, నిత్యతనుశ్రీలు అండర్–17కి శశిధర్, ధనుష్, క్షతరగ్యాన, నేహా, తపస్వీ, జాహ్నవిలు ఎంపికయ్యారన్నారు. వారు నవంబర్ 2 నుంచి 4 వరకు మహబూబాబాద్‌లోని కేసముద్రంలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు.

గ్రామ ప్రత్యేక అధికారిని నియమించాలని వినతి

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డ, మాచవరం గ్రామానికి ప్రత్యేక అధికారి లేక గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే వారే లేకుండా పోయారని, తక్షణమే ప్రత్యేక అధికారిని నియమించాలని రైతు సమన్వయ సమితి గ్రామ మాజీ కోఆర్డినేటర్ మాడుగుల పరుశురాం కోరారు. ఈమేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ జోగు శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గ్రామంలో గత రెండు నెలలుగా వీధి లైట్లు వెలగడం లేదని, తాగునీరు సైతం సక్రమంగా రావడం లేదని తెలిపారు. వీధి కుక్కల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తాగునీటి బోర్లు, గ్రామ పంచాయతీ ట్రాక్టర్ మరమ్మతులకు గురైనా పట్టించుకునే నాథుడే కరువయ్యారని తెలిపారు. గతంలో ఉన్న గ్రామ ప్రత్యేక అధికారి సస్పెండ్ ఇతర కారణాలతో అయినట్లు పేర్కొన్నారు.

అధ్వానంగా సాగర్ కాలువ కట్టలు

- కాల్వ కట్టలపై రాకపోకలకు అంతరాయంగా గుంతలు
- ఇబ్బందులు పడుతున్న రైతాంగం
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు

మునగాల: మండల పరిధిలోని సాగర్ ఎడమ కాలువ కట్టలు గుంతలమయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. మండల కేంద్రం శివారులో ఉన్న సాగర్ ఎడమకాలువ రెగ్యులేటర్ గేట్ల వద్ద నుంచి చిలుకూరు, గరిడేపల్లి మండలం వెలిదెండ వరకు సాగర్ ఎడమకాలువ విస్తరించి ఉంది. ఈ కాలువ కట్టలపై ఇటీవల కురిసిన వర్షాలకు నీళ్లు నిలిచి గుంతలు ఏర్పడ్డాయి. ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు కట్టలపై నడిచే వీలులేకుండా పోయింది. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో పక్షం రోజుల్లో వరికోతలు చేపడుతుండగా ఈ కట్టలపై మరింత రద్దీ ఏర్పడనున్నది. ట్రాక్టర్లు, వరికోత యంత్రాలు ఈ కట్టలపై వెళ్లాలంటే ప్రమాదపు టంచున ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ విషయమై పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు విన్నవించినప్పటికీ ఫలితం లేకపోయిందని రైతులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి వెంటనే కాలువ కట్టలపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని రైతులు కోరుతున్నారు.



సాగర్ ఎడమ కాలువ కట్టపై ఏర్పడిన గుంతలు

కాంట్రాక్టర్ పనులు చేపట్టడం లేదు

కాలువ కట్టలపై గుంతలు ఏర్పడిన మాట వాస్తవమే . గుంతలు పూడ్చేందుకు ప్రతిపాదనలు పంపాం. పనులు కూడా మంజూరయ్యాయి. కానీ సదరు కాంట్రాక్టర్ గుంతలు పూడ్చే పనులు చేపట్టడం లేదు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతా.

– ఎన్‌ఎస్‌పీ ఏఈ సత్యనారాయణ, మునగాల

అధికారులు పట్టించుకోవడం లేదు



ఎడమకాలువ కట్టలపై వర్షపు నీరు నిలవడంతో గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల గుండా ప్రయాణిస్తే వాహనాలు త్వరితగతిన మరమ్మతుల పాలవుతున్నాయి. టాక్టర్ల బేరింగ్‌లు పోతున్నాయి. అధికారులు స్పందించి కట్టలపై ఏర్పడిన గుంతలను పూడ్చాలి.

– కోదాటి సైదులు, రైతు, మునగాల

గుంతలు ఇబ్బందిగా మారాయి



ఎడమకాలువ కట్టపై మునగాల శివారులో ఏర్పడిన గుంతలు రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. కట్టలపై ట్రాక్టర్లతో వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. తక్షణమే గుంతలను పూడ్చాలి.

– మానుపాటి నాగరాజు, కౌలురైతు, మునగాల

ఉద్యమకారుడు శ్రీనివాస్‌కు అండగా ఉంటాం

మఠంపల్లి : తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ పార్టీ మఠంపల్లి మండల మాజీ అధ్యక్షుడు పోతబత్తిని శ్రీనివాస్ కుటుంబానికి అండగా ఉంటామని టీజేఏసీ నాయకుడు మేకల నాగేశ్వరరావు అన్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో పోతబత్తిని శ్రీనివాస్ తన కుడికాలు మోకాలి వరకు కోల్పోయి ఇంటివద్ద చికిత్స పొందుతున్నాడు. బుధవారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒంటెద్దు నరసింహారెడ్డితో కలిసి ఆయన బాధితుడు శ్రీనివాస్, అరుణ దంపతులకు రూ.50 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. శ్రీనివాస్ పరిస్థితిని మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్తానని ఒంటెద్దు నరసింహారెడ్డి ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ పోరాట జేఏసీ కన్వీనర్ వేములూరి రంగాచారి, కేఎల్ఎన్‌రావు, హుజూర్‌నగర్, మఠంపల్లి మండలాల మాజీ జెడ్పీటీసీలు సైదిరెడ్డి, జగన్ నాయక్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పిచ్చయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, రామచంద్రయ్య, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస్ దంపతులకు రూ.50వేలు ఆర్థికసాయం అందజేస్తున్న టీజేఏసీ, బీఆర్‌ఎస్ నాయకులు

పౌరహక్కుల దినోత్సవం

మునగాల : మండలంలోని నరసింహులగూడెం గ్రామపంచాయతీ పరిధిలో గల ఎస్సీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వి.ఆంజనేయులు మాట్లాడుతూ రెండు గ్లాసుల పద్ధతిపై అవగాహన కల్పించారు. కుల వివక్ష, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, బాల్య వివాహాలపై వివరించారు. ఎంఆర్‌ఐ ఎస్.రామారావు, రేపాల పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ లింగం రామకృష్ణ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామపంచాయతీ కార్యదర్శి ఉదయ్, గ్రామ స్థాయి అధికారులు, యువత, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ అంజనేయులు

లోఓల్టేజీ సమస్య ఉండదు : డీఈ

చిలుకూరు : బేతవోలు విద్యుత్ సబ్ స్టేషన్‌లో పరిధిలో ఇక నుంచి లోఓల్టేజీ సమస్య ఉండదని హుజూర్‌నగర్ ట్రాన్స్‌కో డీఈ వెంకటకృష్ణయ్య అన్నారు. బేతవోలు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 5 ఎమ్‌వీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి 8 ఎమ్‌వీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయగా బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాస్‌రావు, అధికారులు జ్యోతికుమార్, ఇందిర, పార్వతి, సిబ్బంది పాల్గొన్నారు.



బేతవోలులో 8 ఎమ్‌వీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న డీఈ వెంకటకృష్ణయ్య

బీఆర్‌ఎస్ పోరాటంతో చార్జీల పెంపు నిలిపివేత

కోదాడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై రూ. 18 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం వేయాలని చూసిందని, బీఆర్‌ఎస్ పోరాటంతోనే విద్యుత్ చార్జీల పెంపును నిలిపివేసిందని బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కె. నయీం అన్నారు. విద్యుత్ చార్జీల పెంపును ఆపినందుకు పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కోదాడలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బుధవారం ఆ పార్టీ నాయకులు టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ముమ్ముందు కూడా అధికార పార్టీ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను అడ్డుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నల్ల భూపాల్‌రెడ్డి, కర్ల సుందర్‌బాబు, చింతల నాగేశ్వరరావు, సంగిశెట్టి గోపాల్, చలిగంటి వెంకట్, అలీమ్, దొంగరి శ్రీను, మాదాల ఉపేందర్, రాజేష్, అబ్బు, బొజ్జా గోపి, లాజర్, ఏడుకొండలు, బాదే రామారావు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సంబరాలు జరుపుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు

4న మాదిగల ధర్మ యుద్ధ సదస్సు



మునగాల : ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రాజు

మునగాల : నల్లగొండ జిల్లా కేంద్రంలో వచ్చే నెల 4న నిర్వహించబోయే మాదిగల ధర్మయుద్ధ జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి, కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏపూరి రాజుమాదిగ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఎంఎస్పీ మండల శాఖ అధ్యక్షుడు లంజేపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహాసభకు ముఖ్య అతిథిగా మంద కృష్ణమాదిగ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కోదాడ నియోజకవర్గం నుంచి మాదిగ జాతి ప్రజలు ఈ పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అంజయ్యమాదిగ, అధికార ప్రతినిధి పాతకొట్ల నాగరాజుమాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కుక్కల కృష్ణ, మండల అధ్యక్షుడు గుడిపాటి కనకయ్యమాదిగ, నాయకులు శ్రీను, పెద్ద కనకయ్య, శ్రీకాంత్, వెంకన్న, లింగయ్య, సైదులు పాల్గొన్నారు.

ధర్మయుద్ధ సదస్సును విజయవంతం చేయాలి

నడిగూడెం : నల్గొండ జిల్లా కేంద్రంలో వచ్చే నెల 4వ తేదీన నిర్వహించబోయే ఎమ్మార్పీఎస్ ధర్మయుద్ధ సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి వేపూరి రాజు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎంఎస్పీ మండల అధ్యక్షుడు మిట్టగణుపుల మోష, జిల్లా అధికార ప్రతినిధి కొత్తపల్లి అంజయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాతకొట్ల నాగరాజు, కార్యదర్శి కుక్కల కృష్ణ, నాయకులు చేకూరు నాగరాజు, బన్నీ, శ్రీధర్, యశ్వంత్, శ్రీపతి, వంశీ పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

నేరేడుచర్ల : ఉద్యోగ విరమణ పొందిన ప్రతిఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్ చైర్‌పర్సన్ అలక సరిత అన్నారు. నేరేడుచర్ల మున్సిపల్ కార్యాలయంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఎల్లంకి వీరారెడ్డికి బుధవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వీరారెడ్డిని సిబ్బంది, ఉద్యోగులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి, కౌన్సిలర్లు రణపంగ నాగయ్య, బాణోతు లలిత, వేమూరి నాగవేణి, సీపీఎం పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్, వార్డు అధికారులు, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన వీరారెడ్డిని సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతి



వేడుకల్లో పాల్గొన్న సీడీపీఓ, సూపర్‌వైజర్, టీచర్లు, తదితరులు

చిలుకూరు : మండల కేంద్రంలో నాయీబ్రాహ్మణ కుల దైవం శ్రీభగవాన్ ధన్వంతరిస్వామి జయంతిని బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. సృష్టిలో మానవజన్మ మొదలైన తరువాత మందులు లేని రోజుల్లో మానవాళికి ఆయుర్వేద వైద్యం అందించిన ఘనత ధన్వంతరిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ వెంకట లక్ష్మి, సూపర్‌వైజర్ సునిత, డాక్టర్ సుశీల, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం

మునగాల : మండల కేంద్రం శివారులో గల శ్రీహరిహరసుత అయ్యప్ప ఆలయం ఆవరణలో ఉన్న అన్నప్రసాద వితరణ కేంద్రంలో బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 210 మంది అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాసాచారి గురుస్వామి తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు పెంటకొట్టు సురేష్, తంగెళ్ల సాంబశివరావు, కొమ్ము ఈదారావు, సంగిశెట్టి రాము, వల్లోజు వెంకన్న, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వే సమర్థవంతంగా నిర్వహించాలి

- జిల్లా అటవీ శాఖ అధికారి పి.సతీష్‌కుమార్

నడిగూడెం : వచ్చే నెల 6వ తేదీ నుంచి నిర్వహించబోయే సమగ్ర కుటుంబ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా అటవీ శాఖ అధికారి పి.సతీష్‌కుమార్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ఎన్యుమరేటర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన 56 అంశాలపై సమగ్రంగా సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి.సరిత, ఎంపీడీఓ సయ్యద్ ఇమామ్, కోఆర్డినేటర్ ఉపేందర్, ఏఈఓ పిచ్చయ్య, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.



నడిగూడెం : శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్, తదితరులు



హుజూర్‌నగర్ : ఎన్యుమరేటర్ల శిక్షణలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

హుజూర్‌నగర్ : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 6వ తేదీ నుంచి 18 వరకు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను సేకరించాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ కత్తుల నాగేందర్, మున్సిపల్ కమిషనర్ యాకూబ్ పాషా, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ ఏఎస్ఓ లోక్యానాయక్, ఏఎస్ఓ శ్రీనివాస రెడ్డి, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

ఎన్యుమరేటర్లకు పూర్తి అవగాహన ఉండాలి

చిలుకూరు : సమగ్ర కుటుంబ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. బుధవారం చిలుకూరు మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర కుటుంబ సర్వేపై ఎన్యుమరేటర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్వేపై ఎన్యుమరేటర్లకు పూర్తి స్థాయి అవగాహన ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధృవకుమార్, ఎంపీడీఓ గిరిబాబు, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

కుల గణన సర్వేపై శిక్షణ

మునగాల : మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నవంబర్ ఒకటి నుంచి మూడు వరకు ఇళ్ల జాబితా, ఆరవ తేదీ నుంచి ఎన్యుమరేటర్లు సర్వే నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్ రమేష్, వ్యవసాయాధికారి బుంగా రాజు, ఎంపీఓ దారా శ్రీనివాస్, ఏపీఓ శైలజ, ఆర్ఐ ఎస్.రామారావు, పలు గ్రామాల గ్రామపంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మునగాల : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ సూర్యనారాయణ



అనంతగిరి : శిక్షణకు హాజరైన బీఎల్‌ఓలు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వార్డు అధికారులు

అనంతగిరి : సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. సర్వే నిర్వహణపై బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా 71 బ్లాక్‌లు ఉండగా ప్రతి బ్లాక్‌లో 150 ఇళ్లు పొందుపరిచినట్లు తెలిపారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి 3 వరకు మండల వ్యాప్తంగా ఇళ్ల జాబితా తయారు, 6 నుంచి కుటుంబ సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. సదస్సులో తహసీల్దార్ కె.హిమబిందు, ఎంపీడీఓ షేక్ సుష్మా, డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్, ఉపాధ్యాయులు రమేష్, ఎంపీఎస్ఓ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మోతె : మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో బుధవారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై ఎన్యుమరేటర్లకు జిల్లా స్థాయి మాస్టర్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సంఘమిత్ర మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా నవంబర్ 6 నుంచి 18 వరకు 56 అంశాలపై ఇంటింటి కుటుంబ సర్వే 83 మంది ఎన్యుమరేటర్లతో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, ఏఓ అరుణ, రెవెన్యూ సిబ్బంది, ఏపీఎం, ఏపీఓ, ఏఈఓలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అధికారులకు సహకరించాలి

హుజూర్‌నగర్ : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టే అధికారులకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ యాకూబ్ పాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీ ఇంటి వద్దకు వచ్చే సర్వే అధికారులకు మీ కుటుంబ వివరాలు ఆధార్ కార్డు, భూమి పట్టాదార్ పాస్‌బుక్ తదితర వివరాలు తెలియజేయాలని ఆయన కోరారు.

వృద్ధాప్యంలో సంతోషంగా గడపాలి

కోదాడరూరల్ : రిటైర్డ్ ఉద్యోగులు వృద్ధాప్యంలో సంతోషంగా గడుపుతూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య అన్నారు. అక్టోబర్ నెలలో పుట్టిన రిటైర్డ్ ఉద్యోగుల సామూహిక జన్మదిన వేడుకలను బుధవారం కోదాడ పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిటైర్డు ఉద్యోగులు సమాజసేవలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాంబాబు, అమృతరెడ్డి, రఘుప్రసాద్, విద్యాసాగర్, పొట్టా జగన్‌మోహన్‌రావు ఉన్నారు.



జన్మదిన వేడుకల్లో పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగులు

కల్యాణ మండపం నిర్మాణానికి సిమెంటు బస్తాలు అందజేత

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మించబోయే కల్యాణ మండపం నిర్మాణానికి బుధవారం కోదాడకు చెందిన ఓరుగంటి రాంప్రసాద్ 50 సిమెంటు బస్తాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భవిరిశెట్టి వెంకటరత్నం, కేవీఎస్ఎన్ గుప్త, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య

అనంతగిరి : జర్నలిస్టులపై దాడి చేయడం హేయమైన చర్య అని వాయిలసింగారం మత్స్య సహకార సంఘం చైర్మన్ కంటు నాగార్జున బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గం పాలకవీడు మండలంలో ఓ జర్నలిస్టుపై ఇటీవల దాడి చేసిన ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టులపై దాడులు జరగకుండా ప్రభుత్వం చట్టాలు రుపొందించాలని ఆయన కోరారు.

గిరిజన సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్ : ప్రభుత్వం గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని, ప్రతి జిల్లాకు ఐటీడీఏ ఏర్పాటు చేసి గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మంలో నవంబర్ 5, 6 తేదీల్లో నిర్వహించబోయే గిరిజన సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలునాయక్, పాండు నాయక్ కోరారు. బుధవారం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, స్వామి, రాజు, శంబయ్య, లక్ష్మణ్, హరియా తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కోదాడరూరల్ : సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గుడిబండలో ఇరమళ్ల కనకమ్మకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆయన అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎండీ.రఫీ, మదార్, వహీద్, జహీర్ ఉన్నారు.

కానిస్టేబుళ్లను విధుల్లోకి తీసుకోవాలి

నేరేడుచర్ల : రాష్ట్రంలో డిస్మిస్, సస్పెండ్ చేసిన బెటాలియన్ కానిస్టేబుళ్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దూళిపాల ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. బుధవారం నేరేడుచర్లలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వారంతపు సెలవుల కోసం, అదనపు పనులు చేయలేక ధర్నా చేస్తే 37 మందిని సస్పెండ్ చేయడం, 10 మందిని శాశ్వతంగా ఉద్యోగాల నుంచి తొలగించడం సరైంది కాదన్నారు. పార్టీ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల కార్యదర్శి సింహాద్రి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను తదితరులు ఉన్నారు.

మినీ స్టేడియం ఏర్పాటుకు త్వరలో నిధులు విడుదల



క్రీడలను ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, గెల్లి రవి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో మినీ స్టేడియం ఏర్పాటుకు త్వరలో నిధులు విడుదల కానున్నాయని మున్సిపల్ వైస్‌చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎన్‌ఎస్‌పీ క్యాంపు హైస్కూల్‌లో జిల్లాస్థాయి అండర్ 14, 17 బాలబాలికల స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. హుజూర్‌నగర్‌లో మినీ స్టేడియానికి రూ.5 కోట్లు మంజూరయ్యాయని, స్థల పరిశీలనలో ఉన్నామని తెలిపారు. కాగా.. ఈ పోటీలకు జిల్లా నుంచి దాదాపు 200 మంది క్రీడాకారులు పాల్గొనగా వారిలో 48 మంది క్రీడాకారులు ఉమ్మడి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ అజాం బాబా, వ్యాయామ ఉపాధ్యాయులు రవి, సునీల్, విశ్వజ్ఞ, మైసయ్య జనార్దన్ రెడ్డి, ఉస్మాన్, నరేష్, రవీందర్ రెడ్డి, వెంకటేశ్వరరావు, నాయకులు రవి, చంద్రశేఖర్, నాగరాజు పాల్గొన్నారు.